

గోకులం ఘోష..!

- బిల్లుల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూపులు
- ఒత్తిడి తెచ్చిన అధికారులు
- అప్పులు తెచ్చి మరీ మినీ గోకులాల నిర్మాణం
- నంద్యాల జిల్లాలో 854 మినీ గోకులాలు
- పూర్తయినవి 517, వివిధ దశలో 311
- రైతులు ఆందోళన చెందొద్దు: ఏపీవో



చాగలమర్రిలో లబ్ధిదారులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డు

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మినీ గోకులాల బిల్లులు ఎప్పుడు వస్తాయో నని పాడిరైతులు వెయ్యి కళ్లతో నిరీక్షిస్తున్నారు. పాడిపరిశ్రమ బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం మినీ గోకులాలకు శ్రీకారం చుట్టింది. పాడి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులకు చేయూతనిస్తూ షెడ్ల నిర్మాణానికి రాయితీ కల్పించింది. పశుపోష కులకు 90శాతం, కోళ్లు, గొర్రెల పెంపకం దారులకు 70శాతం రాయితీ నిర్ణయించడంతో రైతులు షెడ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు. ప్రతి గ్రామంలో రైతులు మినీ గోకులాలు నిర్మించారు. అయితే ప్రభుత్వం నుంచి బిల్లులు మాత్రం రాకపోవడంతో లబ్ధిదారులు క్షణంక్షణం మదన పడుతున్నారు. 6 పశువుల షెడ్డు యూనిట్ కాస్టు రూ.2.30 లక్షలు కాగా ఇందులో 90శాతం ఉపాధి నిధుల కింద చెల్లిస్తారు. 10 శాతం లబ్ధిదారుల వాటా ఉంటుంది. నంద్యాల జిల్లాలో 854 మినీ గోకులాలు మంజూరుకాగా 517 మినీ గోకులాలు పూర్తయ్యాయి. 311 షెడ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కొంతమంది లబ్ధిదారులు అప్పులు తెచ్చి పనులు చేపట్టారు. లబ్ధిదారులకు రెండు నెలలు అవుతున్నా బిల్లులు అందక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.



చింతలచెరువులో బిల్లులు రాక అసంపూర్తిగా ఉన్న గోకులం షెడ్డు

రాయితీ ఇలా..

రెండు పశువుల యూనిట్ ధర రూ.1.15 లక్షలు కాగా రాయితీ రూ.1.3 లక్షలు, రైతు వాటా రూ.11,500, నాలుగు పశువులకు గోకులం యూనిట్ విలువ రూ.1.85 లక్షలు కాగా ఉపాధిహామీ ద్వారా రూ.1.66 లక్షలు, రైతు వాటా రూ.18,500, ఆరు పశువులకు రూ.2.30 లక్షలు కాగా రాయితీ రూ.2.7 లక్షలు, రైతు వాటా రూ.23 వేలు ఉంటుంది.

బిల్లు వస్తుందో.. రాదోనన్న..

పశువుల షెడ్లు నిర్మించుకున్న వారికి బిల్లు చెల్లించకపోవడంతో షెడ్ల నిర్మాణాల్లో పురోగతి లేదు. అప్పులు తెచ్చి షెడ్డు నిర్మిస్తే బిల్లు వస్తుందో.. రాదోనన్న అనుమానాలు నెలకొన్నాయి. బిల్లులు ఎప్పుడు వస్తాయన్నది అధికారులకు కూడా తెలియక షెడ్ల పనులు పూర్తిచేయాలని చెప్పలేక పోతున్నట్లు తెలుస్తోంది.

అధికారుల ఒత్తిడి తీసుకు రావడంతో..

ఆళ్లగడ్డ నియోజకవర్గానికి 119 మినీ గోకులాలు మంజూరయ్యాయి. ఇందులో 90 నిర్మాణాలు పూర్తయ్యాయి. 29 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. నియోజకవర్గంలో 150 నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వ లక్ష్యం. కాగా క్షేత్రస్థాయిలో 119 మాత్రమే మం జూరయ్యాయి. అధికారులు ఒత్తిడి తీసుకురావడంతో లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. బిల్లులు వస్తాయని ఆశతో నిర్మిస్తే ఇప్పటి వరకు ఒక్క బిల్లు కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆళ్లగడ్డలో 26 మినీ గోకులాలు మంజూరుకాగా 21 పూర్తయ్యాయి. దొర్నిపాడు 13మినీ గోకులాలకు 11, శిరివెళ్ల 14 మినీగోకులాలకు 9, ఉయ్యాలవాడ 18మినీ గోకులాలకు 12, రుద్రవరం 23 మినీ గోకులాలకు 17, చాగలమర్రి 25 మినీ గోకులాలకు 20 పూర్తయ్యాయి.

ఒక్క బిల్లు కూడా రాలేదు



ఆరు పశువుల యూనిట్ షెడ్డు నిర్మించా. అందుకు రూ.2.50 లక్షలు ఖర్చు చేశా. త్వరితగతిన పూర్తిచేయాలంటే అప్పుచేసి షెడ్డు నిర్మించా. ఒక్క బిల్లు కూడా రాలేదు.

- జగదీశ్వర్‌రెడ్డి, రైతు, మల్లెవేముల

మూడు నెలలైనా..



మినీ గోకులం షెడ్డు నిర్మించి మూడు నెలలు అవుతుంది. బిల్లులు వస్తాయంటే షెడ్డు నిర్మించాం. ఇప్పటి వరకు ఒక్క బిల్లు కూడా రాలేదు. షెడ్డు నిర్మాణానికి సుమారు రూ.2.50 లక్షలు అయింది.

-ఇంతియాజ్, లబ్ధిదారుడు, చాగలమర్రి

బిల్లులు త్వరలో మంజూరయ్యే..

మినీ గోకులాల బిల్లుల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మినీ గోకులాలు 80శాతం పూర్తిచేశారు. మిగిలినవి వివిధదశల్లో ఉన్నాయి. బిల్లుల విష యంపై ఆందోళన వద్దు. త్వరలోనే బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది.

- ఖాసీంసాహెబ్, ఏపీవో

ఎ(వె)దురు చూపు!

- నల్లమలలో వెదురు సేకరణ, వేలం నిలుపుదల
- ఉపాధి కోల్పోయిన కూలీలు
- ఏటా రెండు సీజన్లలో వేలం
- అనుమతి రాలేదంటున్న అటవీ అధికారులు



రుద్రవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అపారమైన వెదురు సంపద ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో వెదురు సేకరణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుద్రవరం కలప డిపో పరిధిలో సేకరిస్తున్న పచ్చబంగారానికి పెట్టింది పేరు. రుద్రవరం కలప డిపో నుంచి ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతిని చేసిన రికార్డు ఉంది. రుద్రవరం కలప డిపో పరిధిలో ఎంఎం చెలిమ, గొర్రెగుంట, చిల్లమానుపెంట, అహోబిలం, ఊట్ల, గారెళ్ల, వెదురుకూపులు భారీగా ఉండేవి. వీటిలో గారెళ్ల, ఊట్ల ప్రాంతాల్లో వెదురుకూపులు నిషేధించారు. మిగిలిన కూపులు యథావిధిగా ఉన్నాయి. 2024 అక్టోబరు, నవంబరు మాసాల్లో వెదురు శాంపిల్ సేకరించి సేకరణ నిలిపివేశారు. గతంలో ప్రతి నెలా ఐదో తేదీ, 21వ తేదీల్లో వెదురు వేలం నిర్వహించేవారు. దీంతో ప్రతి ఏడాది సుమారు రూ.3 కోట్లకు పైగానే ఆదాయం వెదురు సేకరణ వల్ల సమకూరేది. ప్రతి ఏటా రెండున్నర నుంచి 3 లక్షల టన్నుల వెదురు సేకరణ ఉండేది. అక్టోబరు నుంచి మార్చి వరకు, మార్చి నుంచి జూన్ వరకు రెండు విడతలుగా వెదురు సేకరణ చేపట్టారు. ప్రస్తుతం ఉన్నట్టుండి వెదురు సేకరణతో పాటు వేలం కూడా నిలిపివేశారు.



ఉపాధి కోల్పోయిన కూలీలు

నల్లమలలో వెదురు సేకరణ నిలిచిపోవడంతో కూలీలు ఉపాధి కోల్పోయారు. రుద్రవరం పెద్దకంబలూరు, దొరకొట్టాల, అహోబిలం ఇతర గ్రామాలకు చెందిన వెదురుకూలీలు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదికి రెండు సీజన్లలో వెదురు సేకరణ, వేలంపై దాదాపు వెయ్యి మందికిపైగా కూలీలు ఆధారపడుతూ జీవనం పొందేవారు. సేకరించిన వెదురుతో బుట్టలు, గంపలు తదితర వెదురు వస్తువులు తయారు చేసి విక్రయించేవారు. వెదురు సేకరణ నిలుపుదలతో ఇప్పుడు వారందరూ ఆందోళనలో పడ్డారు. వెదురు సేకరణ లేకపోవడంతో రుద్రవరం కలప డిపో నేడు వెలవెలబోతోంది.

కోర్ ఏరియా.. బఫర్ ఏరియా..!

అటవీ ప్రాంతంలో కోర్ ఏరియా, బఫర్ ఏరియా అనే రెండు పరి మితులు ఉంటాయి. కోర్ ఏరియాకు కేటాయించిన అటవీ ప్రాంతాల్లో ఎలాంటి రాకపోకలు ఉండకూడదు. ఆ ప్రాంతంలో వన్యప్రాణులు సంచ రిస్తుంటాయి. శాశ్వత కట్టడాలు కూడా కోర్ ఏరియాలో నిషేధం. అయితే బఫర్ ఏరియా మాత్రం మానవ అవసరాల నిమిత్తం పనులు చేయ వచ్చు. రుద్రవరం రేంజ్‌లో బఫర్ జోన్ కింద నూతల, ఆలమూరు, అహో బిలం, బీవీపెంట సెక్షన్లు ఉన్నాయి. ఈఏరియాలో రెండు వెదురు కూపు లున్నాయి. వాటిల్లో వెదురు సేకరణ చేసి తమకు ఉపాధి కల్పించాలని కూలీలు అధికారులను కోరుతున్నారు.

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందలేదు



ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందలేదు. శాంపిల్‌ప్లాట్లు వేయించామన్నారు. టెండరు నిర్వహిస్తున్నట్లు ఆదేశాలు అందలేదు. అందుకే వెదురు సేకరణ నిలిపివేశాం. అధికారుల నుంచి ఆదేశాలు వస్తే వెంటనే వెదురు సేకరణకు అనుమతులు, వేలం నిర్వహిస్తాం. - శ్రీపతినాయుడు, ఫారెస్టురేంజ్ ఆఫీసర్, రుద్రవరం

పల్లకిపై విహరించిన ఆది దంపతులు

భక్తులతో కిటకిటలాడిన శ్రీశైలం క్షేత్రం



భక్తులతో కిటకిట లాడిన శ్రీశైలక్షేత్రం

నంద్యాల కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఆదివారం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి పల్లకిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సెలవు రోజు కావడంతో శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో స్వామి,అమ్మవారికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో లోక కల్యాణార్థం స్వామి అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తూ సేవాసంకల్పాన్ని పఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తు లకు పల్లకీసేవ

టీజీపీ ఇన్‌చార్జి ఎస్ఈగా రెడ్డి శేఖర్‌రెడ్డి

నంద్యాల(మున్సిపాలిటీ), జూన్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుడిగట్టు కాలువ సర్కిల్-2 ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డికి తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. అధికారులు ఉదయం 9:30 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. అర్జీదారులు తమదరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏదశలో ఉందో సమాచారం తెలుసు కోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించాలని సూచిం చారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

ఏసీబీ వలలో పోలీస్

- రూ.లక్ష డిమాండ్ ● రూ.80వేలకు బేరం
- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుల్
- ప్రధాన నిందితుడు కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ మధుసూదన్‌గౌడు

7

యాప్‌తో అక్రమాలకు కళ్లెం

- బియ్యం పంపిణీపై నిత్యం తనిఖీలు
- పౌర సరఫరాల శాఖ సిద్ధం



నంద్యాల నూనెపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సాంకేతిక విధానాలు అమల్లోకి తెచ్చినా ప్రజాపంపిణీ బియ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట పడకపోవడంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. గతంలో మాన్యువల్‌గా వీటిని పంపిణీచేసి రికార్డుల్లో కార్డుదారుల సంతకాలు తీసుకునేవారు. కొందరు డీలర్లు ప్రభుత్వం ఇచ్చిన సరుకును సులభంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించేవారు. ఎంఎస్ఎల్ గోదాముల నుంచి సరుకును చౌకదుకాణాలకు తరలిస్తుండగా మధ్యలో దారి మళ్లించేవారు. ఆధార్ వచ్చిన తర్వాత ఈ పాస్ యంత్రాలు తీసుకువచ్చారు. గత ప్రభుత్వం ఎండీయూల వ్యవస్థను తీసుకువచ్చింది. అయినా అక్రమాలు ఆగలేదు. నిత్యావసర సరుకులను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది.

ఇట్టే పసిగట్టేయొచ్చు

జిల్లాలో 1204 చౌక దుకాణాలున్నాయి. వీటి ద్వారా 5,34,234 తెల్ల రేషన్‌కార్డుదారులకు బియ్యం, చక్కెర తదితర వస్తువులను పౌరస రఫరాల శాఖ అందజేస్తోంది. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పంపిణీ చేస్తున్న సరుకులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ యాప్‌ను తీసుకువచ్చింది. పౌరసరఫరాలో పనిచేసే అధికారులు ఇందులో లాగిన్ అయ్యేలా ఏర్పాటు చేశారు. ప్రతి చౌకదుకాణం లావాదేవీలు యాప్‌ద్వారా పరిశీలించే ప్రక్రియ ప్రారంభించారు. చౌకదుకాణం బోర్డు ఉందా, డీలర్ ఉన్నారా లేరా, ఎంత సరుకు విక్రయించారు? నిల్వ ఎంత ఉంది, తేడాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలు ఇందు లో తెలుసుకోవచ్చు. తద్వారా సరుకులు పక్కదారి పట్టకుండా కట్టడిచేయాలని లక్ష్యంగా చేస్తున్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీవరకు ఈ యాప్‌తో తనిఖీ చేస్తారు.



డీసీఎంఎస్ బలోపేతానికి కృషి

చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వై.నాగేశ్వరరావు యాదవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఆ సంస్థ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ ప్రకటించారు. ఆదివారం కర్నూలు నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ముందుగా డీసీఎంఎస్ మేనేజర్ రాజేష్, చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఒకప్పుడు డీసీఎంఎస్ అన్ని విభాగాల కంటే ఆర్థికంగా బలోపేతంగా ఉండే దని, అన్ని రకాల సేవలు ప్రజలకు రైతులకు అందేవని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందన్నారు. అనంతరం డీసీఎంఎస్ అధికారులు, ఉద్యోగులతో సంస్థ ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు తదితర కేంద్రాల పరిధిలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, వాటికి విముక్తి కల్పించి డీసీఎంఎస్ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర కుమార్, డీసీఎంఎస్ కేంద్రాల అధికారులు రాజేష్, రాజు, షేక్షావలి, షర్మిల, రాజీవ్, రవికృష్ణ, నవీన్, కిరణ్ రెడ్డి, ప్రవీణ్, మహేశ్వరరెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే రేషన్

- ఇకపై మరింత పారదర్శకంగా రేషన్ పంపిణీ
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



దివ్యాంగుడికి ఇంటి వద్దనే రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభీష్టం మేరకే రేషన్ దుకాణాల్లోనే సరుకులను అందజేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని రేషన్ దుకాణంలో నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జూన్ ఒకటో తేదీ నుంచి చౌక దుకాణాలు పునః ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 29,796 రేషన్ దుకాణాల్లో రేషన్ బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామ న్నారు. దివ్యాంగులు, వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ వాహనాల ద్వారా ఒక నిర్దిష్టమైన సమయం లేకుండా వారి ఇష్టారీతిన రేషన్ సరఫరా చేసేవారన్నారు. రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో లేదో కూడా తెలియని పరిస్థితి ఉండేదన్నారు. దీంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడేవారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వం ఐవీఆర్ఎస్ కాల్‌ద్వారా ప్రజల మనోభావాలను, అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకొని రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. గతంలో డోర్ డెలివరీ బియ్యం అంటూ జగన్ ప్రభుత్వం నానా హంగామా చేసిందన్నారు. కానీ అదంతా తప్పుడు ప్రచారమేనని ప్రజలు తెలుసుకున్నారన్నారు. ఎక్కడో వీధి చివరన ఒక రోజు ఎండీయూ వాహనం నిలిపి బియ్యం పంపిణీ చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. నెలలో 15 రోజుల పాటు రేషన్ సరుకులు ప్రజలకు అందేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు నాగేశ్వరరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టాభిషేకం

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న పద్మశాలీయ సంఘం నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల పద్మశాలీయ సంఘం పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలీయ కులస్తుల విద్యార్థుల ప్రతిభ పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నంద్యాలలోని భద్రావతి భావన ఋషి దేవాలయ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మెరిట్ ప్రాతిపదికన ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులుగా రూ.10వేలు, రూ.7.5వే లు, రూ.5వేలు, రూ.2వేలు నగదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని 110 మంది విద్యార్థులకు అందజేశారు. భీమనపల్లె వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి విశిష్టఅతిథిగా రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఉడత వెంకట బసవరావు, రాయల సీమ ప్రాంతీయ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కూటమి’పై పోరాటానికి వైసీపీ సిద్ధం

- రెడ్‌బుక్ పేరుతో వైసీపీ నేతలపై కేసులు
- కుడా మాజీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వంపై వైసీపీ పోరాటానికి సిద్ధమైందని కుడా మాజీ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తే రెడ్‌బుక్ పేరుతో వైసీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు అనేక పథకాల అంటూ ప్రజలను మోసగించి టీడీపీ కూటమి ఓట్లు వేయించుకొని గద్దెను ఎక్కిందని ఆరోపించారు. ఇందులో భాగంగా ఈ నెల 4న వెన్నుపోటు దినం అనే పేరుతో గూడూరు పట్టణంలో కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆదిమూలపు సతీష్, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, రమేష్ నాయుడు, రవికుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లింగమూర్తి, లాయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు కేంద్రంగా కంచి యూనివర్సిటీ

- కంచి యూనివర్సిటీ డీన్ ఆచార్య కె. వెంకటరమణ



మాట్లాడుతున్న కంచి యూనివర్సిటీ డీన్ ఆచార్య కె. వెంకటరమణ

కర్నూలు కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):కంచి యూనివర్సిటీ (చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం) ఉన్నత విద్యకు కేంద్రమని ఆ యూనివర్సిటీ డీన్, అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య కె. వెంకటరమణ తెలిపారు. ఆదివారం పాతనగరంలోని శంకర మందిరంలో స్పాట్ అడ్మిషన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, బీఏఎంఎస్, బీఎడ్, బీఎస్సీ, ఎల్‌ఎల్‌బీ, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈ, ఆయుర్వేదంతో పాటు పలు విభాగాల్లో ప్రవేశ ఎంపికలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఇంజినీరింగ్‌లో ఎంసెట్‌తో సంబంధం లేకుండా మెరిట్ ఆధారితంగా ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్తమ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఉంటాయని అన్నారు. ఈనెల 30 వరకు అడ్మిషన్లు ఉంటాయని, విద్యార్థులు తమ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో ‘కంచి యూనివ్ డాట్ ఏసీ డాట్ ఇన్’ వెబ్ సైట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్‌రావు, కార్య నిర్వాహక కార్యదర్శి కళ్లే చంద్రశేఖర్ శర్మ, సభ్యులు హెచ్‌కే రాజశేఖర్, హరిహరనాథశర్మ, నరసింహారావు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పోలీస్

- రూ.లక్ష డిమాండ్
- రూ.80వేలకు కుదిరిన బేరం
- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుల్
- తప్పుడు కేసును కోర్టుకు రెఫర్ చేసేందుకు లంచం
- డీఎస్పీ శ్రీనివాసాచారి సమక్షంలో విచారణ
- సీఐ మధుసూదన్‌గౌడు ప్రధాన నిందితుడు
- ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడి



సీఐ మధుసూదన్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్

కర్నూలు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడు, హెడ్ కానిస్టేబుల్ రవి రూ.80వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేయగా సీఐ మధుసూదన్‌గౌడు తాను నేరుగా కాకుండా హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ ద్వారా బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కొత్తబస్టాండు ఎదురుగా ఉన్న నిర్మల హోటల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపిన వివరాలు.. బాధితులు బెస్త రఘు, బెస్త రవి నుంచి హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రూ.80వేలు లంచంను నేరుగా తీసుకున్నాడు. తాను సీఐ మధుసూదన్‌గౌడు సూచనల మేరకే తీసుకున్నానని చెప్పడంతో ఏసీబీ అధికారులు సీఐని కూడా అదుపులోకి తీసుకున్నారు.

మైదా పిండితో మొదలైన వైరం

స్థానిక బీ.క్యాంపు చెందిన బెస్త రఘు, బెస్త రవి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఓ బేకరి నిర్వహిస్తున్నారు. వీరికి చలపతి అనే వ్యాపారి మైదాపిండి సరఫరా చేస్తుంటాడు. 2023లో మైదాపిండి సరియైన క్వాలిటీ లేకపోవడంతో వీరి మధ్య వైరం నెలకొంది. ఆ ఏడాదే చలపతి, మరో ఇద్దరు మిత్రులు నాగేంద్రబాబు, శ్రీనివాసులుతో కలిసి బెస్త రఘుపై దాడిచేశారు. బెస్త రఘు వీరి ముగ్గురుపైన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులకు బెయిల్ ఇచ్చి పంపించేశారు. ఆ కేసు కోర్టులో ఉండగానే మైదాపిండి వ్యాపారి చలపతి న్యాయవాది కృష్ణారెడ్డి ద్వారా బెస్త రఘుపై కేసు నమోదుచేయాలని కోర్టును ఆశ్రయించాడు. కోర్టు సూచనల మేరకు 2024 జూన్ 3న బెస్త రఘుపై అప్పటి సీఐ శంకరయ్య కేసు నమోద చేశారు. తనపై దాడిచేశాడని చలపతి ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసును విచారించిన సీఐ అందులో వాస్తవాలు లేవని గుర్తించి కేసును పెండింగ్‌లో ఉంచారు.

ఎంత బతిమాలినా...

ఈ కేసులో తమ తప్పేమీ లేదని, తాము చిరు వ్యాపారులమని, తమ పాపకు కూడా అనారోగ్యంగా ఉందని బాధితులు బతిమాలారు. అయినా కూడా సీఐ వినలేదు. కేసును తప్పుడు కేసు అని కోర్టుకు రెఫర్ చేయాలంటే.. మీపై కేసు లేకుండా చేయాలంటే రూ.లక్ష డిమాండ్ చేశాడని బాధితులు ఆరోపించారు. ఇందుకు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ మధ్యవర్తిత్వం వహించాడు. రూ.90వేలకు బాధితులకు, సీఐకి మధ్య బేరం కుదుర్చారు. బాధితులు వారం రోజుల క్రితమే రూ.10వేలు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌కు ఇచ్చాడు. మిగతా రూ.80వేలు ఇచ్చేందుకు వారం రోజులు గడువు కోరారు. ఈ 80వేలు ఇచ్చుకోలేని స్థితిలో ఉన్న బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆదివారం సీఐకి ఫోన్‌చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్‌కు ఇవ్వాలని సూచించడంతో కొత్తబస్టాండు వద్ద నిర్మల హోటల్‌లో హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ రాగానే ఆయనకు రూ.80వేలు అప్పగించారు. అతడు ఆడబ్బులు తీసుకుని హోటల్‌లో ఉన్న క్యాష్ కౌంటర్‌లో పెట్టాడు. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తాను సీఐ సూచనల మేరకు తీసుకున్నానని ఏసీబీ అధికారుల ముందు వాపోయాడు.



హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

పదేళ్లకు పైగా జైలు.. అని బెదిరింపులు

ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సీఐ మధుసూదన్‌గౌడు పెండింగ్ కేసు వివరాలు బయటకు తీశాడు. ఇందులో బెస్త రఘుకు చెందిన కేసు పెండింగ్‌లో ఉందని గుర్తించాడు. ఈ కేసులో నిందితులైన బెస్త రఘు, బెస్త రవిలను నెల క్రితం స్టేసన్‌కు పిలిపించాడు. మీపై కేసు ఉందని వివరణ ఇవ్వాలని ఆదేశించాడు. వీరు కేసు వివరాలకు సీఐకు వివరించారు. అయినా ఆయన సంతృప్తి చెందలేదు. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం మిమ్మల్ని కోర్టులో హాజరు పరిస్తే రిమాండ్ పడుతుందని, పదేళ్లకు పైగా జైలుశిక్ష పడుతుందని బెదిరించాడు. ఇలా నెలరోజుల పాటు స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నాడు.

ఏసీబీ అధికారుల అదుపులో సీఐ

సీఐ ప్రధాన నిందితుడు అని తెలుసుకున్న ఏసీబీ అధికారులు ప్రత్యేక టీం ఏల్కూరు బంగ్లా ఉన్న సీఐ ఇంటి వద్ద కాపలా కాశారు. నిర్మల హోటల్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రెడ్ హ్యాండెడ్‌గా దొరకగానే అక్కడ సీఐని అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయనను స్టేషన్‌కు తీసుకువచ్చి కూర్చోబెట్టారు. రాత్రి పొద్దుపోయేదాకా స్టేషన్‌లోకి ఎవరినీ రానీయకుండా సీఐని విచారించారు. కర్నూలు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారిని స్టేషన్‌కు పిలిపించి ఆయన సమక్షంలో కేసు వివరాలపై విచారణ చేపట్టారు.

ఏసీబీ ఆధీనంలో సీఐ కుటుంబ సభ్యులు

యెల్కూరు బంగ్లాలో ఉన్న సీఐ కుటుంబ సభ్యులు ఏసీబీ అధికారులు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. వారి సెల్‌ఫోన్లు తీసుకుని ఎవరినీ కూడా బయటి వారిని సంప్రదించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం ఆ ఇంట్లో సోదా నిర్వహించే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు.



పట్టుబడ్డ నగదుతో హెడ్ కానిస్టేబుల్



బాధిత సోదరులు బెస్త రఘు, బెస్త రవి

కలకలం..

నగరంలో ప్రధాన పోలీస్ స్టేషన్ సీఐ ఏసీబీకి చిక్కడం పోలీసుశాఖలో కలకలం రేపింది. ఓ కేసును మాఫీ చేసేందుకు లంచం తీసుకుంటూ సీఐ పట్టుబడటంతో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం.

కాళ్లావేళ్లా పడినా కనికరం చూపలేదు

కేసు పరిష్కారం పేరుతో సీఐ నెల రోజులుగా తమను చాలా ఇబ్బంది పెట్టాడు. ఓవక్క వ్యాపారంలో అప్పులై తీవ్రంగా నష్టాల్లో ఉన్న కూడా లంచం డిమాండ్ చేశా డు. తమ తమ్ముని కూతురు ఆరోగ్యం బాగా లేదని కాళ్లావేలా పడినా కూడా కనికరం చూపలేదు.

\- బెస్త, రఘు, బాధితుడు

రూ.100 తక్కువైందని..

పుష్ప సినిమాలో మాదిరిగా ఒక్కటి తక్కువైందనే డైలాగ్‌ను గుర్తుపెట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ దానిని అక్షరాలా పాటించాడు. బాధితులు మొదట రూ.10వేలు ఇచ్చిన సమయంలో ఇంటికి వెళ్లి లెక్కపెట్టుకుని రూ.100 తక్కువైందని మరీ ఫోన్ చేశాడని బాధితులు ఆరోపించారు. ‘తిరిగి ఆ నోటు ఇచ్చే సమయంలో కూడా రూ.100 తక్కువైనా కూడా మా సీఐ ఊరుకోడబ్బా..’ అంటూ చెప్పాడని బాధితులు ఆరోపించారు.

పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

బనగానపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పురుగుమందు తాగి ఓ వ్యక్తి బలవ న్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనంలో మండలంలోని పలుకూరు గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన అబ్దుల్‌గని అనే వ్యక్తి తాగుడుకు బానిసై పనులకు వెళ్లకుండా అనారో గ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు మందలించగా జీవితంపై విరక్తి చెంది ఆదివారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు షేక్ అలీ మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

కర్నూలు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేపీ వెంకటరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న ఎక్సైజ్ ఉద్యోగి ఇంట్లో చోరీ చోటు చేసుకుంది. బాలచంద్రుడు కర్నూలు ఎక్సైజ్ కార్యాలయంలో సూప రింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 28వ తేది తన కుటుంబ సభ్యులతో కలిసి షిర్డీకి వెళ్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో ఉన్న 15 తులాల బంగారు నగలు, అర కిలో వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కంటైనర్

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారి-44లో చెరుకులపాడు క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం బైక్‌ను కంటైనర్ ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. కృష్ణగిరి మండలం ఎరుకులచెరువు గ్రామానికి చెందిన సురేష్, కురువ బాలు అలియాస్ ప్రహ్లాద బైక్‌పై స్వగ్రామం ఎరుకులచెరువుకు వెళ్తున్నారు. కాగా చెరుకులపాడు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా కర్నూలుకు వెళ్తున్న కంటైనర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్(35) అక్కడికక్కడే మృతి చెందగా, కురువ బాలు అలియాస్ ప్రహ్లాదకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మృతుడు రైతు, ఆయనకు భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

ఎన్‌హెచ్-44 రహదారిపై బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. చల్ల కుమారస్వామి అనే వ్యక్తి కర్నూలు వైపు వెళుతూ లిమ్రాస్ ఫంక్షన్ హాలు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడటతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో 108 అంబులెన్స్ సిబ్బంది కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. క్షతగాత్రుడు కర్నూలుకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు.

షెడ్డు దగ్ధం

పాములపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో గ్రీస్, ఆయిల్ షాపు షెడ్డు ఆదివారం కాలిపోయింది. టీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఆవరణలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన మహేశ్ అనే వ్యక్తి వాహనాలకు సంబంధించిన గ్రీస్, ఆయిల్ స్పేర్ పార్ట్స్, గాలిమర, తదితర వస్తువుల షెడ్డు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం ఎవ్వరూలేని సమయంలో షెడ్డు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో మెత్తం వస్తువులు కాలిపోయాయని, రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి తీవ్రగాయాలు

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కేపీతండా గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ధనకానాయక్, భీమాబాయి దంపతుల కుమార్తె రజితాబాయి. ఇంటివద్ద స్నేహితులతో కలిసి ఆడుకుంటూ నీళ్ల ట్యాంకు మెట్లు ఎక్కుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్ గురైంది. తీవ్రంగా గాయపడిన రజితను కుటుంబీకులు చికిత్సనిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యంకోసం కడప వైద్యశాలకు తరలించారు. గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను సవరించి ఇక ముందు ప్రమాదాలు జరుగకుండా చూడాలని గిరిజనులు కోరారు.

కాపు భవన్‌కు రూ.కోటి

- బీసీలు, కాపుల సంక్షేమానికి కృషి
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ప్రసంగిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలో కాపు భవన్ నిర్మాణానికి రూ.కోటి ఇస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. ఆదివారం కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బలిజ సంఘం ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ బీసీలు, మైనార్టీలతో పాటు కాపుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆయా వర్గాలు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల కర్నూలులో బీసీ భవన్ నిర్మాణానికి రూ.కోటి సహకారం అందిస్తానని ప్రకటించానని గుర్తు చేశారు. అదేవిధంగా కాపు భవన్ నిర్మాణానికి సైతం కోటి రూపాయలు తన తరఫున అందజేస్తానని తెలిపారు. ఇంకా అవసరమైతే ప్రభుత్వం తరఫున సహకరిస్తామని చెప్పారు. అనంతరం కాపు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలను మంత్రి అందజేశారు.

అభివృద్ధిలో శరవేగంగా ఏపీ

గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెనక్కు వెళ్లిపోయాయని మంత్రి పేర్కొన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనతి కాలంలోనే అనేక పరిశ్రమలు తీసుకువచ్చామన్నారు. రాష్ట్రాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిలో గుజరాత్ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. గుజరాత్ రాష్ట్రం మాదిరి ఏపీలోనూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు తన వద్దే పరిశ్రమల శాఖను ఉంచుకుని స్వయంగా పర్యవేక్షించారన్నారు. అంతటి కీలకమైన శాఖను తనపై నమ్మకంతో ఇచ్చారని, సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నా మన్నారు. హైకోర్టు తరహాలోనే కర్నూలులో ఏర్పాటు చేయబోయే హైకోర్టు బెంచ్ భవనం ఉంటుందని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి వరకు పారిశ్రామిక హబ్ శరవేగంగా ఏర్పాటవుతోందన్నారు. అనంతరం మంత్రి టీజీ భరత్‌ను బలిజ(కాపు) సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, పారిశ్రామికవేత్త అనంతయ్య, కాపునాడు అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్ల రవి, సోమశేఖర్, ఈశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బలిజ సంఘం నాయకులతో ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ప్రజలకు సూచించారు. ఈ నెల 7న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో ఆదివారం ఆయా మతల పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పండుగలను అన్ని వర్గాల ప్రజలు మతసామరస్యంతో సంబరంగా చేసుకోవాలే తప్ప వివాదాలకు దారితీసే విధంగా ఉండకూడదని సూచించారు. ఏదైనా సున్నితమైన విషయాలు చోటుచేసుకున్నప్పుడు పెద్దలు వాటిని సవరించాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. ఆత్మకూరు ప్రాంతం ప్రశాంతతకు నిలయమని, ఇక్కడ హిందూ, ముస్లిం సోదరభావంతోకలిసి ఉండటం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని పండుగలను ఐక్యమత్యంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్ఐ నారాయణరెడ్డి ఉన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ పరీక్ష



నంద్యాలలో ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం నాలు పట్టణాల్లో డీఎస్సీ మోడల్ పరీక్ష నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు బనగానపల్లె పట్టణాల్లో నిర్వహించిన మోడల్ పరీక్షలో 1500 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. నంద్యాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను డీవైఈవో శంకర్‌ప్రసాద్ ఆవిష్కరించారు. ఆళ్లగడ్డలో జిల్లా గౌరవాధ్య క్షుడు భార్గవరామయ్య, ఎస్ఎం బాషా ఆధ్వర్యంలో, ఆత్మకూరు పట్ట ణంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా ఆధ్వర్యంలో, బనగాన పల్లెలో రాష్ట్ర నాయకుడు రామపుల్లారెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు.

ఆత్మకూరు: డీఎస్సీకి సిద్ధమయ్యే అభ్యర్థులు ఒత్తిళ్లను అధిగమించి పోటీ పరీక్షల్లో రాణించాలని పీఆర్ టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా సూచించారు. పట్టణంలోని శ్రీపద్మావతి హైస్కూల్‌లో ఆదివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో విషయ నిపుణులు వెంకటేశ్వర్లు నేతృత్వంలో డీఎస్సీ మోడల్ టెస్ట్ నిర్వహించారు. స్నేహ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆశా, పీఆర్‌టీయూ నాయకులు నూర్‌మహ్మద్, హుస్సేన్ సాహెబ్, దామరేకుల రవి, ప్రదీప్ కుమార్, సయ్యద్ మోయిద్దీన్, సాంబశివుడు, ముర్తుజా, షఫీవుల్లా, ఆరీఫ్, మోమిన్ వలి తదితరులు ఉన్నారు.

'హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నందికొట్కూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం నందికొట్కూరు సీపీఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద ఒకేసారి రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పించలేదని పొగాకు రైతులను కొన్ని కంపెనీలు నిలువునా ముంచుతున్నా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదన్నారు. రైతులు పండించిన పొగాకు పంటను నేటి వరకుకొనుగోలు చేయకపోవడం మూలంగా రైతులు పొగాకు బేళ్లను తగలబెట్టారని ఆయన తెలిపారు. సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, రాజు, ఉస్మాన్ బాషా, వెంకటేశ్వర్లు, బాబు, డీవీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

పాములపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీ కృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని, ప్రతి ఒక్కరూ ఖర్మయోగం విశిష్టత తెలుసుకోవాలని, త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చింతపల్లి కమిటీ, ఆత్మకూరు కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు అన్నారు. ఆదివారం మండలంలోని మిట్టకందాలలో ఇంటింటికి మద్భగవద్గీత ప్రచారం నిర్వహించారు.

ఫైరింగ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

నంద్యాల హాస్పిటల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల్లోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఆదివారం ఎన్‌సీసీ కేడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. అలాగే మార్చ్‌పాస్ట్‌లో మెళకువలు నేర్పించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి వ్యక్తిత్వ వికాసంపై ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో రెగ్యులర్‌గా జరుగుతున్న ట్రైనింగ్ ఆక్టివిటీస్‌ను ఎన్‌సీసీ కేడెట్లకు నిర్వహించారు. పదిరోజుల శిక్షణలో భాగంగా యోగా, డ్రిల్, పీటీ, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, గేమ్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. యోగా శిక్షకురాలు డా.లలితాసరస్వతి ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజువారి శిక్షణలో భాగంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ జోబి ఫిలిఫ్, లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియలు శిక్షణాశిబిరాన్ని పర్యవేక్షించారు.

పచ్చిరొట్టతో భూసారం పెంచుకోవాలి



రైతు సేవా కేంద్రం వద్ద ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు

వెలుగోడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంచుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఆదివారం వెలుగోడు మండలంలోని రేగడగూడూరు, గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ ముందు చేపట్టాల్సిన సన్నద్ధత కార్యక్రమాల గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లి శాస్త్రవేత్త బాలరాజు, శ్రీనివాస్ వ్యవసాయశాఖ అధికారి పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ

ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన పలు రేషన్ దుకాణాలను పునః ప్రారంభించడంతో పాటు 65ఏళ్ల వృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. వైసీపీ దోపిడీలో భాగమే ఇంటింటికి రేషన్ విధానమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రంలో సుపరిపాలన ఉందని అన్నారు. శ్రీశైల నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే శిల్పాకు సవాల్ విసిరారు. ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దార్లు అంజనేయలు, మనోహర్, సివిల్ సప్లై డీటీ శ్రీనివాసులు, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, నాయకులు అబ్దుల్లాపురం బాషా, నబిరసూల్, రాజారెడ్డి, షాబుద్దిన్, ముర్తుజా తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని పలు చౌకదుకాణాల్లో కార్డుదారులకు రేషన్‌ను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకే కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ టీడీపీ నాయకులు జమీల్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: పేదల కడుపు నింపే ప్రజాపంపిణీ వ్యస్థను ఒక క్రమ పద్ధతిలో గాడిలో పెడతామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో డీలర్ల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను పునః ప్రారంభించి సరుకులను పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదిరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: అయ్యలూరులో నాలుగు చౌక దుకాణాలను ప్రారంభించారు. టీడీపీ నాయకులు త్రిలింగేశ్వరరెడ్డి, బైరెడ్డి శంకరమ్మ, ప్రణవానందరెడ్డి, పరమేశ్వరరెడ్డి, ఫరూక్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాములపాడు: రుద్రవరం గ్రామంలో తహసీల్దార్ సుభద్రమ్మ, వేంపెంట గ్రామంలో డీటీ పఠాన్‌బాబు మిగతా గ్రామాలలో ఆర్ఐ,



ఆత్మకూరులో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వీఆర్వోలు రేషన్ దుకాణాలను ప్రారంభించారు. అయితే గ్రామాల్లో సర్పంచులను ఆహ్వానించకుండా రెవెన్యూ అధికారులు ఎలా ప్రారంభోత్సవాలు ఎలాచేస్తారని పాములపాడు సర్పంచ్ మేకల భాగ్యమ్మ ప్రశ్నించారు. ఈవిషయంపై వివిధ గ్రామాల సర్పంచులతో కలసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పాణ్యం: మండలంలోని 32 చౌకధరల దుకాణాలను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. ఆర్ఐ రాము, వీఆర్వో శంకర్, టీడీపీ, జనసేన నాయకులు ఖాదర్‌బాషా, ఎంపీటీసీ రంగరమేష్, జగదీశ్‌బాబు, సుబ్బక్రిష్ణ, డీలర్లు సుధాకర్, రాజు లబ్దిదారులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలో రేషన్ దుకాణాల వద్ద రేషన్ లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు సీతారామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పంట రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలో రేషన్ షాపులను కూటమి నాయకులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు శేషిరెడ్డి, అబ్దుల్‌కలాం మోమిన్ రసూల్, శంకరరెడ్డి, ఖలీల్, హంజా, హుస్సేన్, సయ్యద్, వజీరు, బాషా, ముర్తుజావలి, శాలుబాషా, అధికారులు పాల్గొన్నారు.

గోస్పాడు: సాంబవరం గ్రామంలో రేషన్ సరుకులను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి పాల్గొన్నారు. గోస్పాడులో సింగిల్‌విండో మాజీ చైర్మన్ వీరసింహారెడ్డి, జిన్నుశ్రీనివాసరెడ్డి రేషన్ సరుకులలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ జూపల్లె రామగోపాల్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని 20 గ్రామాల్లో రేషణ్ దుకాణాల్లో



అల్లూరులో రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయసూర్య



పెద్దదేవళాపురంలో..

ఆదివారం డీలర్లు రేషన్ బియ్యం, పంచదార పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణనాయక్, ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య, డీలర్లు సుజాత, హసీనా బాలవెంకటరెడ్డి, రంగస్వామి, మోహన్‌రావు, దస్తగిరి, జేమ్స్ పాల్గొన్నారు.

మహానంది: గోపవరం గ్రామంలో దివ్యాంగుడికి ఇంటి వద్దకు రేషన్‌ను తెలుగుగంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర అలంకారంలో శివయ్య

నంద్యాల కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి ఈశాన్యంలో వెలసిన మూలమఠం శైవక్షేత్రం అతి పురాతన శైవక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయం జీర్ణోద్ధరణ చేపట్టబోతున్నారు. దీంతో భీమేశ్వరస్వామి వారి విశేష అనుగ్రహ దర్శనం ఆదివారం భక్తులకు కల్పించారు. దాదాపుగా సంవత్సరం తరువాత మాత్రమే భీమేశ్వరస్వామి దర్శనం ఉంటుందని ఆలయ ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. అంతవరకు బాలాలయంలో ఉన్న కలశాలకు మాత్రమే పూజా కార్యక్రమాలు జరుగుతా యని చెప్పారు. ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



నంద్యాలలో అర్ధనారీశ్వర అలంకారంలో దర్శనమిచ్చిన శివయ్య

కుమారస్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో ఆదివారం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో ఉదయం సుబ్రహ్మణ్యస్వామికి వేదపండితులు విశేష నిర్వహించారు. ఆదివారం షష్టి తిథి సందర్భంగా కుమారస్వామికి దేవస్థాన సేవగా పూజలు నిర్వహించారు. స్వామివారి అభిషేకానికి ముందుగా మహాగణపతిపూజ, పంచామృత అభిషేకం, వివిధ పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

శివతత్వంపై ప్రవచనం

నంద్యాల కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో ఆదివారం తెనాలి నోరి కోదండరామ్‌చే తెనాలివారి శివతత్వం-శివ వైభవంపై ప్రవచనా కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర రెడ్డి తెలిపారు. ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో హరికథ, బుర్రకథ, సంప్రదాయనృత్యం, వాయుద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తపల్లికి పదోన్నతిపై నలుగురు హెచ్‌ఎంలు

కొత్తపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపల్లి మండలంలోని వివిధ జిల్లా పరిషత్ హై స్కూళ్లకు పదోన్నతిపై నలుగురు ప్రధానోపాధ్యాయులు రాగా, మరొకరు బదిలీపై వచ్చినట్లు కొత్తపల్లి ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. ఆదివారం ఎంఆర్‌సీ భవన్‌లో ఎంఈవో-2 ఇనయతుల్లా మాట్లాడుతూ వివిధ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై గోకవరం పాఠశాలకు కె.సుబ్బరాయుడు, వేల్పనూరు హై స్కూల్ నుంచి వచ్చినట్లు చెప్పారు. అలాగే కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు కె.వెంకటరమణ గోకవరం పాఠశాల నుంచి పదోన్నతిపై వచ్చినట్లు తెలిపారు. శివపురం జడ్పీహెచ్‌ఎస్‌కు ఎం.వెంకటేశ్వర్లు పదోన్నతిపై కొత్తపల్లి హై స్కూల్ నుంచి వచ్చినట్లు తెలిపారు. ముసలిమడుగు హైస్కూల్‌కు పి.వెంకటేశ్వర్లు కనకయ్య కొట్టాల హై స్కూల్ నుంచి పదోన్నతిపై వచ్చినట్లు తెలిపారు. దుద్యాల జడ్పీహెచ్‌ఎస్‌కు కొక్కెరచెడు హై స్కూల్ నుంచి కె.సుబ్బారెడ్డి అనే ప్రధానోపాధ్యాయుడు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. వీరందరూ బాధ్యతలు స్వీకరించారని ఎంఈవో-2 పేర్కొన్నారు.

అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేసినట్లు ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లోనే అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటుబుక్స్, యూనిఫాం, బ్యాగులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఇప్పటికే అందజేశామన్నారు. ఇంకా షూ రావాల్సి ఉందని తెలిపారు. పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు హెచ్‌ఎంలు అందజేస్తారని ఎంఈవో వివరించారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మిడుతూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మిడుతూరులో అభయ ఆంజనేయ స్వామి 40 అడుగుల ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం గణపతి పూజ, గోపూజ, పుణ్యాహ వాచనం, అభిషేకాలు. 4వ తేది ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమం, మన్యుసూక్త, శ్రీరామ నామ తారక మంత్ర హోమాలు, ఆంజనేయ స్వామి పీఠ ప్రతిష్ఠ, 5న దీక్షా హోమం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, బలిదానం, పూర్ణాహుతి హోమం, కలశోద్వాసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విగ్రహం ఊరేగింపు: అభయ అంజనేయ స్వామి విగ్రహాన్ని ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, కాతా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్‌ఎస్ లెవెన్స్ జట్టు విజయం

నంద్యాల హాస్పిటల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజుల నుంచి ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న శాంతిరామ్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ విజేతగా ఆర్‌ఎస్ లెవెన్‌జట్టు నిలిచింది. రఘురామ్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో 70 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోటీలో ఆర్‌ఎస్ లెవెన్స్, మణి హైట్స్ తలపడ్డాయి. ఆర్‌ఎస్ లెవెన్ జట్టు విజయం సాధించింది. ఈ టోర్నీలో గెలుపొందిన ఆర్‌ఎస్ లెవెన్స్ జట్టుకు రూ.60వేల నగదు, ట్రోఫీని మిద్దె రఘురాం అందజేశారు. అలాగే ద్వితీయ స్థానం సాధించిన మణిహైట్స్ జట్టుకు రూ.40వేల నగదు, ట్రోఫీని అందజేశారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



నంద్యాలలో నిరసన దీక్షలో పాల్గొన్న రాష్ట్రీయ ధర్మ రక్షా దళ్ కార్యకర్తలు

నంద్యాల కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని నంద్యాల మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఆదివారం రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్ ఆధ్వర్యంలో గో ఆగ్రహ నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గోరక్షక్ విభాగ్‌జిల్లా ప్రముఖ్ రామ్‌చరణ్, జిల్లా ఉపాధ్యక్షులు శివ, జిల్లా సహ కార్యదర్శి ప్రతాప్, మండల అధ్యక్షుడు సతీష్, పట్టణ అధ్యక్షుడు నిఖిల్, బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ మండ్ల గంగాధర్, సెక్రటరీ ప్రసాద్‌రాజు, కిసాన్



వెలుగోడు ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మోర్చా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి గోపి, మోహన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: గోవుల అక్రమ తరలింపును అరికట్టాలని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం వారు వెలుగోడు ఎస్ఐ సురేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గోవులను రవాణ చేసే వాహనాలను అడ్డుకొని గోవులను గోశాలకు తరలించాలని కోరారు. రాజశేఖరరెడ్డి, మహేశ్, ప్రతాప్ ఆచారి, తిరుపాల్‌నాయక్, మధుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నందికొట్కూరు రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూటి చౌరస్తా జాతీయ రహదారి 340 సీ పై ఆదివారం టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బ్రాహ్మణ కొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాలివీ. వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఎల్లగౌడ్, రహీమ్ బైక్‌పై కర్నూలు నుంచి ఆత్మకూర్ వైపు వస్తుండగా టిప్పర్ కర్నూలు వైపు వెళ్తుండగా వాహనాలు ఢీకొన్నాయి. ఇందులో బైక్‌పై ఉఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని అందులో రహీమ్ పరిస్థితి పూర్తి విషమంగా ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిని ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఎల్లగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల టౌన్, జూన్1(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా ఆదేశాలకు మేరకు ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. సత్ప్రవర్తనతో మెలగాలని చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హె చ్చరించారు. వారి జీవనోపాధి, వృత్తులపై ఆరా తీశారు. ప్రస్తుతం వారి నడవడికను తెలుసుకున్నారు. ప్రతిఒక్కరిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని అన్నారు. యువకులు కూడా చట్ట వ్యతిరేక కార్యాకపాలకు పాల్పడితే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు



నంద్యాలలో ప్రశాంసా పత్రాలతో విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ మౌలాలిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి సమ్మర్ క్యాంప్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. లలితకళతో పాటు చెస్, కరాటే, చిత్రలేఖనం, కాలిగ్రఫీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, శాస్త్రీయ, జానపద, ఆధునిక నృత్యంలో సుశిక్షితులైన ఉపాధ్యాయుల చేత నేర్పించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నంద్యాల కల్చరల్: నంద్యాలలోని సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం నిర్వహకులు పల్లంశెట్టి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. నిర్వాహకుడు సురేష్ మాట్లాడుతూ గత నెలరోజులుగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో కూచిపూడి, చదరంగంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థులకు మొదటి అడుగులు, శ్లోకాలు, హస్తభేదాలు, చ దరంగంలో ఓపెనింగ్ గేమ్, మిడిల్‌గేమ్, ఎండింగ్ గేమ్ వంటి అంశాలు నేర్పించారు. విద్యార్థులు,



నంద్యాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన నిర్వాహకులు



ఆత్మకూరులో ముగింపు కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు

తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల క్రీడా వికాస కేంద్రంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ రైల్వే వాలీబాల్ క్రీడాకారుడు కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. అలాంటి క్రీడల పట్ల చిన్నతనం నుంచి పిల్లలు ఆసక్తి చూపాలని సూచించారు. ఆత్మకూరు స్పోర్ట్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా, తైక్వాండో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సయ్యద్ అసదుల్లా, ఖోఖో శిక్షకులు మహెబూబ్, బాక్సింగ్ శిక్షకులు ఉపేంద్ర, జిమ్ శిక్షకుడు సిద్ధిక్, తైక్వాండో శిక్షకుడు ఖాజాహుస్సేన్, స్వామన్న తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా పంట కాలువ

● రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డు లేని వైనం



పారుమంచాలలో పాఠశాల ఎదురుగా రక్షణ గోడలు లేని పంట కాలువ

జూపాడుబంగ్లా, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుమంచాల గ్రామంలో జడ్పీ హైస్కూల్ ఎదురుగా పది అడుగుల మేర పంట కాలువ ప్రమాదకరంగా ఉంది. గతంలో రహదారి నిర్మించారు. అయితే పంట కాలువ వద్ద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రతిరోజు విద్యార్థులతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వందల సంఖ్య రోగులు వెళ్తుంటారు. ఈ ప్రమాదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు ఇరువైపుల గోడలు నిర్మించి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి: ఆర్డీవో



రేషన్ షాపును ప్రారంభించి కార్డును అందిస్తున్న ఆర్డీవో నరసింహులు

డోన్ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులను ప్రజలకు సక్రమంగా అందించాలని ఆర్డీవో కేపీ నరసింహులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో రేషన్‌షాపులను ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపుల్లో సరుకుల పట్టిక, స్టాక్ వివరాలు బోర్డులో రాసి ఉంచాలని ఆదేశించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే డీలర్‌షిప్‌ను తొలగించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, ఆర్ఐ మస్తాన్, వీఆర్వోలు రామకృష్ణారెడ్డి, రామాంజనేయులు, ఖాజా, జి.మనోహర్, యూనిస్, సీనియర్ అసిస్టెంట్ కేవీ ఉపేంద్ర పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

డోన్ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్లను బేతంచెర్ల ఎంపీపీ నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ప్యాపిలి మండల వైసీపీ నాయకుడు బోరెడ్డి పుల్లారెడ్డితో కలిసి ఎంపీపీ ఆవిష్కరించారు. మాజీ మంత్రి బుగ్గన హాజరు కానున్నారని, డోన్, ప్యాపిలి, బేతంచెర్ల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రుడు, సోమేష్ యాదవ్, జగదుర్తి మోహన్ రెడ్డి, పోస్టు ప్రసాద్, జాకీర్ హుసేన్, ఆర్ఈ రాజావర్ధన్, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, చలం వంశి, మేకల నాగరాజు, క్వాలిటీ అబ్దుల్లా, చంద్రశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం :సీఐ

డోన్ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే అవసరమని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూనగర్‌లో అక్షర స్కూల్ ఆవరణంలో సికోకై కరాటే ఇంటర్నేషనల్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో చీఫ్ ఎగ్జామినర్‌గా ఉమ్మడి జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ బెల్టు గ్రేడింగ్ నిర్వహించారు. విజేతలకు సీఐ బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రమణ, సీని యర్స్ శ్రీనిత్య బాలాజి, జగన్, జయంత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఎస్సీ మోడల్ పరీక్ష

బనగానపల్లె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ 2025పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం బనగానపల్లె పీఆర్‌టీయూ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డీఎస్సీ మోడల్ పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామపుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు దస్తగిరి పలువురు పాల్గొన్నారు.


కుందూకు వరద

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెవేముల గ్రామ సమీపంలోగల కుందూనది వరద నీటితో జలకళ సంతరించుకుంది. ఆదివారం ఎగువ నుంచి వచ్చిన వరద నీరు ఆనకట్ట నుంచి కుందూలో ప్రవహించింది. పరిసర పొలాల్లో భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీటి మట్టం పెరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ముగిసిన రాతిదూలం పోటీలు

ప్యాపిలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల గ్రామంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలో 15 జతల వృషభాలు పాల్గొన్నాయి. అందులో బాపట్ల జిల్లా వెంకటపాలెం గ్రామానికి చెందిన రైతు శివక్రిష్ణచౌదరి వృషభాలు మొదటి స్థానం నిలవగా కర్నూలు జిల్లా రుద్రవరం షేక్‌మున్నా, గోపాల్‌గౌడు వృషభాలు రెండవ స్థానంలో నిలిచాయి. అలాగే నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డి, అనంతపురం జిల్లా అక్కంరెడ్డిపల్లికు చెందిన ఇంద్రారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు, తెలంగాణ హుజూర్‌నగర్‌కు చెందిన సహస్ర యాదవ్, గుంటూరు జిల్లా పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన లక్ష్మయ్య, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రాజారెడ్డి వృషభాలు విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.80వేలు, రూ.60వేలు, రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు నిర్వాహకులు అందజేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్యాపిలి మండలం జలదుర్గంలో గురువులతో పూర్వవిద్యార్థులు

ప్యాపిలి, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జలదుర్గం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 1994-95 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన దాదాపు 50మందికిపైగా పూర్వ విద్యార్థులు దాదాపు 30 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నబీ రసూల్, శివ, మదనశేఖర్, నరసింహ ఆంజినేయులు, మగ్బుల్‌బాషా, తిమ్మప్ప, మహబూబ్ బాషా, హుసేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు నగర్ గ్రామంలో..

బేతంచెర్ల: మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో పాణ్యం సిమెంట్స్ ఉన్నత పాఠశాలలో 2002-03 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం పాఠశాల హెచ్‌ఎం ముసారఫ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆనాటి గురువులు గోవిందు, ప్రసాద్, నిర్మల, దేవమణి, సూరిబాబు, నాగమణి, సుధాకర్ శర్మ, రామకృష్ణ, రఘునాథ్ రెడ్డి, భాస్కర్‌లను సత్కరించారు. ఒకే వేదికపై కలుసుకునేందుకు కృషి చేసి న కేశవ సుబ్బరాజు, భార్గవిదేవి, రజిని, రవీంద్రనాయక్, సురేష్, మహాలక్ష్మీ, ఆనంద్, ప్రసాద్, రూప, మాధవిని ఉపాధ్యాయులు, అభినందించారు.

నందివర్గం ఉన్నతపాఠశాలలో..

బనగానపల్లె: మండలంలోని నందివర్గం ఉన్నతపాఠశాలలో 1994-95లో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 26 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకొని అనుభవాలను పంచుకున్నారు.

కాలువలు ఇలా..

నీరు పారేదెలా?

- అధ్వానంగా కేసీ పంట కాలువలు
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- ఆందోళనలో రైతులు

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీ కెనాల్ పంట కాలువలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయి అధ్వానంగా మారాయి. సైడ్‌వాల్ పూర్తిగా దెబ్బ తిన్నాయి. పంట కాలువ పనుల్లో నాణ్యత లోపించడంతో బీటలు వారి నీరు వృథాగా పోతున్నాయి. దీంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. మల్లెవేముల గ్రామ సమీపంలో ప్రధాన కాలువ నుంచి పంట పొలాలకు నీరందించే డిస్ట్రిబ్యూటర్ చానల్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 300 ఎకరాలకు సాగునీరు అందిం చాల్సి ఉండగా 30 ఎకరాలకు మాత్రమే నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. చివరి ఆయకట్టు వరకు డ్రైనేజీ పనులు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. జంగాలపల్లె కేసీ ప్రధాన కాలువ నుంచి చేపట్టిన లైనింగ్ పనులు సరిగా చేయక పోవడంతో నీరు లీకేజీ కావడంతో పంట పొలాలు నీట మునిగి దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. మూడేళ్లుగా కేసీ కాలువ లీకేజీ నీటితో సాగు చేసిన పంటలు నీట మునిగి దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పది వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అధికారులు స్పందించి దెబ్బతిన్న పంట కాలువలకు మరమ్మతులు చేపట్టి అసంపూర్తిగా ఉన్న కాలువలను పూర్తి చేయించి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



మల్లెవేములలో ముళ్ల కంపలతో నిండుకున్న కేసీ పంట కాలువ



లైనింగ్ దెబ్బతిన్న కేసీ పంట కాలువ

నీరు అందడం లేదు



కాలువలు అధ్వానంగా ఉన్నాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. లైనింగ్ దెబ్బతిని పిచ్చి మొక్కలు మొలచి అధ్వానంగా ఉన్నాయి. కాలువలు మరమ్మతులు చేసి నీరు లికేజీ కాకుండా చూడాలి. అసంపూర్తిగా ఉన్న కాలువలను పూర్తి చేసి సాగునీరు అందించాలి.

• మల్లారెడ్డి, రైతు, మల్లెవేముల

లైనింగ్ పనులు చేపట్టాలి



మల్లెవేముల కేసీ కెనాల్ లైనింగ్ పనులు చేపట్టాలి. కేసీ ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. కాలువలంతా ముళ్ల కంపలతో, పూడికతో నిండుకుంది. కొన్ని చోట్ల కాలువలు దెబ్బతిని గోడలు కుప్పకూలాయి. కాలువలు సరిగా లేక పోవడంతో సాగునీరు అందడం లేదు. చెంతనే నీరు ఉన్నా ప్రయోజనం లేదు.

• రామకృష్ణారెడ్డి, రైతు, మల్లెవేముల

పావన లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న పూజారులు, కమిటీ సభ్యులు

ఆళ్లగడ్డ జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులంపల్లెలో వెలసిన పావన లక్ష్మినరసింహ స్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకొన్న ఎమ్మెల్యేకు కమిటీ సభ్యులు , టీడీపీ నాయకులు గౌరు వెంటరామిరెడ్డి ఆధ్వర్యంలో గజమాల వేసి సత్కరించారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు శంకరయ్య, సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, నరసింహా పాల్గొన్నారు.

డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ

ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే ప్రభుత్వం డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్త మసీదు కాలనీలోని ఇమాంబీ చౌకదుకాణంలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, డీటీ చంద్రశేఖర్‌రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు మజీద్ పాల్గొన్నారు.

చింతలాయపల్లెలో తీవ్ర ఉద్రిక్తత

కొలిమిగుండ్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం టీడీపీ, వైసీపీ నాయకుల ఘర్షణతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చింతలాయపల్లె అతి సమస్యాత్మకమైన ఫ్యాక్షన్ గ్రామం కావడంతో తాజా పరిస్థితులు ఎక్కడికి దారి తీస్తాయోనని సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం టీడీపీ నాయకుడు అంబటి జయలక్ష్మీరెడ్డి ఇంటి సమీపంలో జరిగిన ఓ వేడుకలో సుమారు 20మంది వైసీపీ శ్రేణులు హాజరయ్యారు. అయితే తిరిగి వెళ్తున్న సమయంలో కొందరు మద్యం మత్తులో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద ఉన్న వాహనాలను కాళ్లతో తన్ని, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారు. దీన్ని గమనించిన టీడీపీ కార్యకర్తలు ఇది సరైన విధానం కాదంటూ చెబుతుండగానే ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ముగ్గురికి గాయాలయ్యాయి. కాగా కావాలనే వైసీపీ శ్రేణులు తమ ఇంటిపైకి దాడికి వచ్చారని టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, కొలిమిగుండ్ల పోలీసులు హుటాహుటీనా చింతలాయపల్లెకు చేరుకున్నారు. గొడవపై విచారిస్తుండగా వైసీపీ శ్రేణులు సీఐ రమేష్‌బాబు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



సీఐ రమేష్‌బాబుతో వాగ్వాదానికి దిగిన వైసీపీ శ్రేణులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆర్టీసీ బస్టాండ్‌లో మొక్కను నాటుతున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు, డీఎం వెంకటేశ్వర్లు

ఆళ్లగడ్డ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించి మొక్కలు నాటాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు జి. ఉషారాణి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లను మనం నాటితే అవి భావి తరాలకు చక్కటి నీడనిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు శ్రీదేవి, సుజాత, సరోజ, విజయలక్ష్మి, ఆర్‌టిసి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆరు పాఠశాలలకు హెచ్‌ఎంల నియామకం

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎంలను నియమిస్తూ జిల్లా విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో అనూరాధ ఆదివారం తెలిపారు. చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలకు జీవయ్య, బాలికోన్నత పాఠశాలకు శివలక్ష్మి, చిన్నవంగలికి సుధాకర్‌గుప్త, చింతల చెరువకు సుబ్బరాయుడు, మద్దూరుకు మహబూబ్‌బాష, గొడిగనూరుకు శ్రీనివాసులు హెచ్‌ఎంలుగా నియమించినట్లు తెలిపారు. కస్తూర్బా గాంధీ పాఠశాలకు ఎస్‌వోగా స్వప్న బాధ్యతలు చేపట్టారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుంశింగవరం సమీపంలో మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. బెలుం గ్రామానికి చెందిన సుబ్బు, గాయత్రి గోవిందిన్నె గ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా బెలుంశింగవరం సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం వారిని బనగానపల్లె ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ పేదల ప్రభుత్వం

డోన్ రూరల్/చాగలమర్రి/రుద్రవరం/ ఉయ్యాలవాడ/బేతంచెర్ల/ దొర్నిపాడు/శిరివెళ్ల/కొలిమిగుండ్ల/ కోవెలకుంట్ల/అవుకు/సంజామల /ప్యాపిలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పాతపేటలో రేషన్ దుకాణాల పునః ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మ న్ కోట్రికే హరికిషన్, టీడీపీ పట్టణ నాయకులు ఓంప్రకాష్, తహసీల్దార్ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

• చాగలమర్రిలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా ఆధ్వర్యంలో తొమ్మిదవ చౌకదు కా ణంలో పంపిణీ చేశారు. రుద్రవరంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర య్య, రెవెన్యూ అధికారులు రేషన్ పంపిణీని పరిశీలించారు.

• ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి తహసీల్దారు శ్రీనివాసులు రేషన్ దుకాణాలను ప్రారంభించారు.

• బేతంచెర్ల మండలంలో రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రకాష్‌బాబు హెచ్చరించారు.

• దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామంలో తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో డీలర్ రేషన్ పంపిణీ చేశారు.

• శిరివెళ్ల మండలం కాదరబాదరలో మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప ఆధ్వర్యంలో డీలర్ బ్రహ్మయ్య రేషన్ పంపిణీ చేశారు.

• కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని 11నంబర్ రేషన్ దుకాణాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, నాయకులు గూడూరు నాగేశ్వరరెడ్డి, శేఖరరెడ్డి, రంగస్వామి, పుల్లయ్య ప్రారంభించారు. ఉమ్మాయిపల్లెలో ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డి రేషన్ పంపిణీ చేశారు.

• కోవెలకుంట్ల పట్టణంలో రేషన్ షాపులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి, నాయకులు బీవీ ప్రసాదరెడ్డి, గ డ్డం అమర్ నాథరెడ్డి, గడ్డం నాగేశ్వర్ రెడ్డి, డీలరు పుల్లారెడ్డి, ప్రారంభించారు.

• అవుకు మండలం రామాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనా రెడ్డి, వడ్డె వెంకటపుల్లయ్య, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ చేశారు.

• సంజామల మండలంలో పలు చౌకదుకాణాల్లో రేషన్‌ను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు.



డోన్‌లో రేషన్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



కోవెలకుంట్లలో రేషన్‌షాపులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు గడ్డం అమర్‌నాథరెడ్డి, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి తదితరులు



దొర్నిపాడులో రేషన్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సుభద్ర

వైభవంగా కలశ స్థాపన



కలశ స్థాపన పూజలు చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో ఆదివారం వేద పండితులు పుల్లయ్య, భీమయ్య ఆధ్వర్యంలో కలశస్థాపన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. దేవతా మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయదారులచే ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు, దాతలు, ప్రజల సహకారంతో విగ్రహాలు, ధ్వజస్తంభం, ఉత్సవమూర్తులు, పానిమట్టంకు పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

డ్రైనేజీ మరమ్మతులు ప్రారంభం



పైపులైన్‌ను శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డోన్ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిగురుమానుపేట మ సీదు ప్రాంతంలో డ్రైనేజీల మరమ్మతు పనులు మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీలు ఎక్కి మురుగు నీరు రోడ్డుపై పారుతూ కుంటల మారాయి. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' మే 24న 'రోడ్డుపై మురుగునీరు' అనే కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి టీడీపీ శ్రేణులతో కలిసి ఈ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులను మరమ్మతులు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ ప్రసాద్‌గౌడు ఆధ్వర్యంలో హుటాహుటిన చేరుకుని పైపుల్లో ప్లాస్టిక్ కవర్లు, వేస్టేజీ పేరుకుపోయి బ్లాక్ కావడంతో మురుగునీరు రోడ్డుపై పారుతుందని గుర్తించి పనులు చేపట్టారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు.

ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

డోన్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎస్ఆర్ యూత్ అభిమానులు రోగులకు వారి సహాయకులకు బ్రెడ్లు, పాలు, జ్యూస్‌లు పంపిణీ చేశారు. అంతకు ముందు ఎంఎస్ఆర్ కార్యాలయంలో సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని పాతబస్టాండులో టీడీపీ జెండా వద్ద పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో ధర్మవరం సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీకి సిద్ధం

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న ఆయా పాఠశాలలకు కిట్లను సరఫరా చేస్తామన్నారు. 4,914 మంది విద్యార్థులకు 23,460 పాఠ్యపుస్తకాలు, 23,500 నోట్ పుస్తకాలు, యూనిఫారం, బ్యాగులు సరఫరా చేస్తామన్నారు. బెల్ట్‌లు, షూలు కూడా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

నేడు మద్దూరులో పెద్దమ్మ జాతర

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు గ్రామంలో పెద్దమ్మతల్లి దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఎస్సీ కాలనీవాసులు ఆదివారం తెలిపారు. 2న గ్రామ దేవతలకు పూజలు, అమ్మవారి ప్రతిష్ఠ, బోనాల కార్యక్రమం ఉంటుందన్నారు. 3న పెద్దమ్మతల్లి జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

101 టెంకాయలు కొట్టిన విద్యార్థిని

రుద్రవరం: స్థానిక పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం మౌనిక అనే విద్యార్థిని 101టెంకాయలు కొట్టి తన భక్తిని చాటుకున్నారు. అమ్మవారికి నెయ్యితో అభిషేకం చేశారు. పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని చిన్నకంబలూరు, కొండ మాయపల్లె, యల్లావత్తుల గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కోటి శివలింగాలతో ప్రత్యేక పూజలు



దేవాలయంలో శివలింగాలను తయారు చేస్తున్న భక్తులు

రుద్రవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం సమీపంలోని గుట్ట కొండ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ ఆవరణంలో వీరయ్య అనే ఆధ్యాత్మికవేత్త ఆధ్వర్యంలో ఆదివారం పుట్టమట్టితో శివలింగాలు తయారు చేశారు. వీటి తయారీకి రుద్రవరం, కొండమాయపల్లె, కొత్తపల్లె, కొత్తూరు, వెలగలపల్లె ఇంకా పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. మట్టితో తయారు చేసిన చిన్నచిన్న శివలింగాలను దేవాలయం ఆవరణంలో పెద్ద శివలింగం ఆకారంలో అమర్చి పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త వీరయ్య దంపతులు, నల్లగల్ల వెంకటేశ్వర్లు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మతపెద్దలతో సమావేశమైన సీఐ దస్తగిరి, ఎస్ఐ వరప్రసాద్

రుద్రవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ వరప్రసాద్ అన్నారు. ఆదివారం రుద్రవరం పోలీసుస్టేషనులో ముస్లింలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని, ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో మతపెద్దలు పాల్గొన్నారు.

ముందస్తు అక్రమ అడ్మిషన్లు అరికట్టాలి

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని తెలుగురాష్ట్ర విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల వారు విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే కరపత్రాలతో ప్రచారాలు, అడ్మిషన్‌లు చేపడుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులను అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.